# సాక్షి అనంతపురం

శుక్రవారం । 7 । జూన్ । 2024






**టన్ను చీనీ రూ.40 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40 వేలు పలికాయి.



**15.2 మీటర్లలో భూగర్భజలం**

జిల్లాలో భూగర్భజలాలు సగటున 15.22 మీటర్లుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

8లో

గరిష్టం/కనిష్టం

37.3°/23.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత కొనసాగింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### శాంతియుతంగా ఎన్నికలు

- సహకరించిన అందరికీ ధన్యవాదాలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్




**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో ముగిసిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మార్చి 16న షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల నిర్వహణలో అధికారుల సహాయ సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ నిర్వహణకు సూచనలు, సలహాలు అందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

### 57,702 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లావ్యాప్తంగా గురువారం నాటికి 62,184 మంది రైతులకు 57,702 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ 68,157 క్వింటాళ్లకు 77,190 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్నందున సాధ్యమైనంత తొందరగా రైతులు విత్తనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందులు, రాగులు, కొర్రలు, మినుములు, పెసలు, పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### టీబీ డ్యాంకు 1,581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

**బొమ్మనహాళ్:** కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో మరింత పెరిగింది. బుధవారం 517 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం ఉదయానికి 1,581 క్యూసెక్కులకు చేరింది. డ్యాంలో ప్రస్తుతం 1,578.14 అడుగుల నీటి మట్టంతో 3.630 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయబసవన కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,581.10 అడుగుల వద్ద 5.030 టీఎంసీల నీరు ఉండేవి. ఇన్‌ఫ్లో 723 క్యూసెక్కులుండింది. త్వరలో ఇన్‌ఫ్లో మరింత పెరిగి డ్యాం నిండవచ్చని టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

### హెచ్చెల్సీకి 26.36 టీఎంసీలు

- కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 172 టీఎంసీలు



బోర్డు సమావేశంలో నీటి కేటాయింపులపై చర్చిస్తున్న అధికారులు

**రాయదుర్గం:** హెచ్చెల్సీకి 26.36 టీఎంసీల నీటిని కేటాయిస్తూ టీబీ బోర్డు కార్యాలయం తీర్మానించింది. తుంగభద్ర జలాశయం నుంచి 2024–25 ఖరీఫ్‌లో ఆయకట్టుకు అందించే సాగునీటి కేటాయింపులు ఖరారయ్యాయి. గురువారం విజయనగర (హొస్పేట్) టీబీ బోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్‌ఈ ఆర్ శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో కర్ణాటక, అనంతపురం, కర్నూలు జిల్లాల ఇంజినీరింగ్ అధికారుల బృందం సమావేశమై చర్చించారు. జలాశయం నీటి లభ్యత 212 టీఎంసీలు కాగా, ఈ ఏడాది వివిధ కారణాలతో 172 టీఎంసీల నీరు జలాశయంలోకి చేరవచ్చనే అంచనాకు వచ్చారు. ఇందులో దామాషా ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి 112.765 టీఎంసీలు, ఏపీకి 53.953 టీఎంసీలు, తెలంగాణకు 5.282 టీఎంసీల నీటిని కేటాయించారు. హైలెవెల్ (హెచ్ఎల్‌సీ)కి 26.368 టీఎంసీలు కేటాయించారు. సమావేశంలో అనంతపురం, కర్నూలు జిల్లాల ఇరిగేషన్ ఎస్‌ఈలు ఎన్.రాజశేఖర్, పి.రెడ్డి శేఖర్‌రెడ్డి, ఎల్లెల్సీ ఈఈ నీలకంఠారెడ్డి, బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఇంజినీరింగ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో భయం భయం

- టీడీపీ శ్రేణులు రెచ్చిపోతుండడంతో ప్రజల్లో ఆందోళన
- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తుండడంపై విస్మయం

టీడీపీ శ్రేణుల దాష్టీకాలు ఆగడం లేదు. వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. బాణాసంచాలు కాలుస్తూ అందరినీ ఉలిక్కిపడేలా చేస్తున్నారు. వీరి వీరంగంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఉన్మాదంతో ప్రభుత్వ ఆస్తులనూ ధ్వంసం చేస్తుండడంపై విస్తుపోతున్నారు.



ఆత్మకూరు మండలం గొరిదిండ్లలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



ధ్వంసమైన ఉప్పరపల్లి సచివాలయ, ఆర్బీకే కార్యాలయ బోర్డులు



బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో గ్రామ సచివాలయ ఆర్చ్ వద్ద వైఎస్సార్ బొమ్మను సుత్తితో పగలకొడుతున్న టీడీపీ కార్యకర్త



తాడిమర్రి మండలం ఎం. అగ్రహారంలో సచివాలయ శిలాఫలకం ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

**సాక్షి నెట్‌వర్క్:** అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. గురువారం సాయంత్రం సచివాలయం, రైతు భరోసా కేంద్రం బోర్డులను ధ్వంసం చేశారు. ఉద్యోగులంతా ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత కొందరు టీడీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని ఈ ఘాతుకానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. మూడు రోజుల క్రితం రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామంలోని సచివాలయంలో ఉద్యోగులను బెదిరించి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ప్రింటర్, బాత్రూం డోర్లు, సింథటిక్ ట్యాంక్ పైపులను ధ్వంసం చేశారు. ఈ ఘటన మరవకముందే ఉప్పరపల్లిలో సచివాలయం, ఆర్బీకే కార్యాలయాల బోర్డులను ధ్వంసం చేయడం చర్చనీయాంశమవుతోంది. ఈ ఘటనపై శుక్రవారం సచివాలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

**ఈలలు, కేకలు వేసుకుంటూ హల్‌చల్**

బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి గ్రామంలో గురువారం టీడీపీ కార్యకర్తలు స్వైర విహారం చేశారు. ఈలలు, కేకలు వేసుకుంటూ హల్‌చల్ చేశారు. గ్రామ సచివాలయం ఆర్చ్‌పై ఉన్న వైఎస్సార్ బొమ్మను సుత్తితో ధ్వంసం చేశారు. సచివాలయ, రైతు భరోసా శిలాఫలకాలను ధ్వంసం చేసేందుకు యత్నించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

**వైఎస్సార్ విగ్రహం కూల్చివేత**

ఆత్మకూరు మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పగులగొట్టి నేల మట్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విగ్రహాల ధ్వంసం ఘటనలు చోటుచేసుకుంటుండంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పలువురు హితవు పలికారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఎన్టీఆర్ బొమ్మలను కనీసం ముట్టలేదని, కానీ నేడు ఇలా కూల్చివేతలకు దిగడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

**సచివాలయ శిలాఫలకం ధ్వంసం**

తాడిమర్రి మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని సచివాలయం శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో గ్రామం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన గ్రామ సచివాలయం నిర్మించారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పేర్లను తెలుపుతూ గ్రామ సచివాలయ గోడకు అతికించిన శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన కొండన్నగారి శివయ్య, కే.నాగరాజు, కే.రామకృష్ణ, కే.రాజేష్, నీరుగంటి రవీంద్ర, సాకే మదన్‌మోహన్, నీరుగంటి రాజశేఖర్, బాటన్నగారి లక్ష్మన్న, నీరుగంటి నాగార్జున, నీరుగంటి శివానంద, అయ్యన్నగారి నాగరాజు పిన్నదరి శ్రీమన్నారాయణ, నారాయణస్వామి తదితర టీడీపీ కార్యకర్తలు ఇనుప సుత్తితో పగులగొట్టారు. ఎస్‌ఐ నాగస్వామి గ్రామానికి వెళ్లి దుండగులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ప్రవేటు ఆస్తులు ధ్వంసం చేయడం కానీ అకారణంగా గొడవలు, ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన స్పష్టం చేశారు.

**వార్డు సభ్యురాలి ఇంటిపై దాడి**

సోమందేపల్లి మండల కేంద్రంలోని మారుతి నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ వార్డు సభ్యురాలు ఆశాబీ ఇంట్లోకి గురువారం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలు చొరబడి దాడి చేశారు. ఈ నెల 4న ఆశాబీ ఇంటి ముందు టీడీపీ కార్యకర్తలు టపాసులు కాల్చడంపై ఆమె కుమారులు అక్బర్, ఇర్ఫాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దాన్ని మనసులో పెట్టుకున్న వారు గురువారం తన ఇంట్లోకి చొరబడి కుమారులపై దాడి చేయడంతో పాటు ఆస్తి నష్టం చేసినట్లు బాధితురాలు వాపోయారు. భయభ్రాంతులకు గురైన తన కుమారులు గ్రామం నుంచి పరారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొడికొండలో భయోత్పాతం**

**చిలమత్తూరు:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మండలంలోని కొడికొండలో వైఎస్సార్ సీపీపీ కార్యకర్త నరసింహ మూర్తిపై ఇష్టారీతిన టీడీపీ నాయకులు దాడి చేశారు. తలపగులగొట్టారు. అలాగే, అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈడిగ నాగభూషణ ఇంట్లో చొరబడి దాడికి యత్నించారు. ఈ ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. కొడికొండ పంచాయతీలో వైఎస్సార్ సీపీకి మెజారిటీ రావడాన్ని జీర్ణించుకోలేక దాడులకు తెగబడ్డారని ఆ పార్టీ శ్రేణులు వాపోయారు. ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు నరసింహులు, నాగేంద్రబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ గంగాధర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలా వ్యవహరించడం సరికాదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి తెలిపారు.

### పోలీసుల ఎదుటే విచక్షణారహితంగా దాడి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉరవకొండ పట్టణంలోని కణేకల్లు క్రాస్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం సాయంత్రం టీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కర్రలతో టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. ఒక్కసారిగా తల, కాళ్లు, చేతులపై కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఇంత జరుగుతున్నా అక్కడే బందోబస్తులో ఉన్న స్పెషల్ పార్టీ పోలీసులు ప్రేక్షక పాత్రలో ఉండిపోవడం విమర్శలకు తావిస్తోంది. కాపాడండి సార్ అంటూ బాధితుడు మొర పెట్టుకుంటున్నా ఏమాత్రం స్పందించకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాధితుని బంధువులు సైతం తమ బిడ్డను కాపాడాలంటూ అక్కడ ఉన్న పోలీసుల కాళ్లా వేళ్లా పడ్డా కనికరించకపోవడం గమనార్హం.

### కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రత్యేక కమిటీ

**అనంతపురం ఎడ్యుకేషన్:** టీడీపీ గెలిచిన తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. దాడులు, దౌర్జన్యాలకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని పార్లమెంట్ స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 11 మంది సభ్యులతో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కమిటీని నియమించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ, ఎమ్మెల్సీలు మంగమ్మ, యల్లారెడ్డి గారి శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వరరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, శింగనమల నియోజకవర్గ నాయకుడు ఎం.వీరాంజనేయులును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి కార్యకర్తకూ, అక్క చెల్లెమ్మకూ, సోదరుడికీ, సోషల్ మీడియా సైనికులకు కమిటీ తోడుగా ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఎల్లప్పుడూ అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

**గుంతకల్లుటౌన్:** 'గుంతకల్లు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా గడిచిన ఐదేళ్లల్లో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించాము. అయినా ఎందుకో ప్రజల తీర్పు భిన్నంగా ఉంది. పార్టీ నాయకులు, కార్యకర్తలెవ్వరూ అధైర్య పడొద్దు. మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. నిత్యం ప్రజల్లో ఉండి టీడీపీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటాం' అని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన గుంతకల్లు పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీఆర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యాన్ని, కొంత బాధను కలిగించినా ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి నాంది అని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసానిచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ శ్రేణులు హింసాత్మక ఘటనలకు ప్రేరేపిస్తున్నారని, కార్యకర్తలు గొడవల జోలికి వెళ్లకుండా సంయమనం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, సీనియర్ నాయకులు యుగంధర్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య, ఉమా



టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన వాహనాలు

**కళ్యాణదుర్గం:** శాంతికి మారుపేరైన కళ్యాణదుర్గంలో హింసాత్మక ఘటనలు జరగడం బాధాకరమని, దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం తెలిసిందే. గురువారం మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య ఉమా ఇంటికి వెళ్లి దాడి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన వ్యక్తులు ప్రజా సేవకు పాటుపడాలని, ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపడం సరికాదన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిశాలి

**రాయదుర్గం:** ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఉపేక్షించమని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. గురువారం రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్, శాంతినగర్, నేసేపేట, కణేకల్లు రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల వరకే పార్టీలని, ఆ తర్వాత ఏ పార్టీ గెలిచినా, ఓడినా అందరూ సమన్వయంతో నడవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు కొనసాగిస్తున్నామన్నారు. ప్రత్యేక మొబైల్ పార్టీలతో గస్తీ నిర్వహిస్తున్నామని చెప్పారు. కొందరు అనవసరంగా దాడులకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, అలాంటి వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం సరికాదన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటే 100కు డయల్ చేయాలే తప్ప నేరుగా దాడులకు తెగబడరాదని సూచించారు. గొడవలకు ప్రేరేపించినా క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**హద్దు మీరితే చర్యలు తప్పవ్**

**ఉరవకొండ:** హద్దు మీరితే చర్యలు తప్పవని ఎస్పీ గౌతిమి శాలి హెచ్చరించారు. గురువారం ఉరవకొండలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు తావులేకుండా బందోబస్తు చేపడుతున్నామన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించమని, రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఉరవకొండలో దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్, రూరల్ సీఐలు సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్రప్ప పాల్గొన్నారు.

**దాడులకు పాల్పడితే కఠిన చర్యలు**

**కళ్యాణదుర్గం రూరల్:** దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ గౌతమిశాలి హెచ్చరించారు. గురువారం కళ్యాణదుర్గం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు సృష్టించే వారిని ఇప్పటికే బైండోవర్లు చేయించామని, వాళ్లే మళ్లీ ఈ తరహా ఘటనలకు పాల్పడితే బైండోవర్ సమయంలో ష్యూరిటీ ఇచ్చిన ప్రకారం నష్ట పరిహారం వసూలు చేస్తామన్నారు. ఆ మొత్తం కట్టకుంటే జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.

## యల్లనూరు మండలంలో భారీ వర్షం

- 27 మండలాల పరిధిలో 18.3 మి.మీ సగటు నమోదు

**అనంతపురం అగ్రికల్చర్/గార్లదిన్నె:** జిల్లాపై వరుణుడి కరుణ కొనసాగుతోంది. యల్లనూరు మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 27 మండలాల పరిధిలో 18.3 మి.మీ సగటు నమోదైంది. యల్లనూరు మండలంలో 89.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే తాడిపత్రి 75 మి.మీ, యాడికి 32.4 మి.మీ, రాప్తాడు 32.4 మి.మీ, పుట్లూరు 31.4 మి.మీ, కూడేరు 30 మి.మీ, కళ్యాణదుర్గం 29.2 మి.మీ, పెద్దవడుగూరు 23.2 మి.మీ, అనంతపురం అర్బన్ 22 మి.మీ, రూరల్ 14.2 మి.మీ, ఉరవకొండ 21.6 మి.మీ, పెద్దపప్పూరు 21.4 మి.మీ, కణేకల్లు 20 మి.మీ, బెళుగుప్ప 18.6 మి.మీ, బుక్కరాయసముద్రం 18 మి.మీ, వజ్రకరూరు 17.2 మి.మీ, కుందుర్పి 16.4 మి.మీ, గుత్తి 14.6 మి.మీ, విడపనకల్లులో 12.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా మొదటి వారంలోనే 66.1 మి.మీ నమోదు కావడం విశేషం. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కూడా పలు మండలాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షపాతం నమోదైంది. ఈనెల 15 నుంచి జూలై నెలంతా ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ఐదు రోజులు వర్షసూచన**

నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల ఐదు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం బులెటిన్ విడుదల చేశారు. ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందన్నారు. కొన్ని చోట్ల 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు.



ఉరవకొండ పట్టణంలోని నెహ్రూ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

## క్లుప్తంగా

### ప్రమాదంలో వ్యక్తి మృతి

**వజ్రకరూరు:** ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి తండాకు ఎస్.సక్రియా నాయక్ (45) ఈ నెల 4న ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పీసీ ప్యాపిలి క్రాస్ వద్ద రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైన సక్రియానాయక్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్సకు స్పందించక బుధవారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఎస్‌బీఐలో బీమా ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సక్రియానాయక్‌కు భార్య సుజాతతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఇద్దకు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### నీట్‌లో సత్తా



మయాంక్ శర్మ, బెన్వర్, సాయికిరణ్

**గుత్తి:** పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించి ప్రతిభ చాటారు. వివరాలు... గుత్తికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు కాంత్రికుమార్, రమాప్రభ దంపతుల కుమారుడు ఎం.మయాంక్ శర్మ నీట్ ఫలితాల్లో 700 మార్కులు సాధించాడు. విజయవాడలో ఇంటర్ విద్యాభ్యాసం చేసిన మయాంక్ శర్మ జాతీయ స్థాయిలో 2,072, కేటగిరి కింద 168వ ర్యాంక్ సాధించడం గమనార్హం. అలాగే గుత్తికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓబులేసు, పశువైద్యాధికారి భారతి దంపతుల కుమారుడు బెన్వర్ 720 మార్కులకు గాను 696 మార్కులతో జాతీయ స్థాయిలో 2,707, కేటగిరి కింద 63వ ర్యాంక్ సాధించి తన సత్తా చాటాడు.

**పెనుకొండ:** రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన సాయికిరణ్ ఇటీవల పెనుకొండలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొంది నీట్ జాతీయ స్థాయిలో 12,824వ ర్యాంక్ సాధించాడు. కేటగిరి స్థాయిలో 5,410వ ర్యాంక్ సాధించిన సాయికిరణ్‌ను కోచింగ్ సెంటర్ యాజమాన్యం అభినందించింది.

### మాతృత్వం చాటుకున్న మేక



మేకపాలు తాగుతున్న ఎనుముదూడ

**రాయదుర్గం టౌన్:** ఆకలితో అలమటిస్తున్న ఓ దూడకు ఓ మేక తన స్థన్యమిచ్చి మాతృత్వాన్ని చాటుకుంది. గురువారం రాత్రి రాయదుర్గంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పాడిరైతు పవన్‌కు చెందిన గేదె దూడ.. మేక పాలు తాగుతూ కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మేకలు, గేదెలు తమవేనని, అప్పుడప్పుడు ఓ మేక నేరుగా దూడవద్దకెళ్లి ఇలా పాలు ఇస్తుంటుందని ఆయన వివరించారు.

# సందడిగా చేపల వేట



చేపలను క్రేట్‌లలో నింపుతున్న జాలర్లు



క్రేట్‌లో చేపలను ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

చుట్టూ పచ్చని పంట పొలాలు... మధ్యలో ఉన్న శింగనమల చెరువు నీటిలో ఎగిసి పడుతూ సందడి చేస్తున్న చేపలు.. ఆహ్లాదాన్ని పంచుతున్న వాతావరణంలో మత్స్యకారులు వలలు పట్టుకుని... తెప్ప (పుట్టి) లేసుకుని చెరువు మధ్యలోకి వెళ్లారు. కాసేపట్లోనే తిరిగి ఒడ్డుకు చేరుకున్నారు. పుట్టి నిండా చేపలే... సందడిగా సాగిన చేపల వేట ఆద్యంతం ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. శింగనమల చెరువులోని చేపలు ఎంతో రుచికరంగా ఉంటాయని ప్రసిద్ధి. ఈ క్రమంలో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారనే విషయం తెలియగానే జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలకు చెందిన కొనుగోలుదారులు ఒక్కసారిగా అక్కడ వాలిపోయారు. తాజా చేపలను ఖరీదు చేయదానికి పోటీ పడ్డారు. పెద్ద సంఖ్యలో చేపలను బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు తరలించేందుకు కంటైనర్లు సైతం అక్కడకు చేరుకోవడం గమనార్హం. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



చేపలు పట్టి ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు



శింగనమల చెరువు వద్ద క్రయవిక్రయదారుల సందడి



చేపలను రాసులుగా పోసిన దృశ్యం

# మొక్కజొన్నలో యాజమాన్యం పాటించండి

- తెగుళ్ల నివారణలో అప్రమత్తత అవసరం

**బుక్కరాయసముద్రం:** దీర్ఘకాలిక వేరుశనగ, వరి పంటల సాగు కన్నా తక్కువ పెట్టుబడితో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేపడితే అధిక లాభాలు సాధించవచ్చునని రైతులకు బుక్కరాయసముద్రం మండల వ్యవసాయాధికారి శ్యాం సుందర్‌రెడ్డి సూచించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కత్తెర పురుగు నివారణపై రైతులు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. నీటి వనరులు తక్కువగా ఉన్నా... తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో త్వరగా పంట చేతికి వస్తుందన్నారు.

**నాణ్యమైన విత్తనాలనే ఎన్నుకోవాలి**

మొక్కజొన్న సాగులో మేలు రకం విత్తనాలను ఎంచుకోవాలన్నారు. హైబ్రిడ్ రకాలు మార్కెట్‌లో అద్వాంట–741, 751, 758, డెకాల్బ్–9178, 9144 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇది అధిక దిగుబడిని ఇచ్చే మధ్యకాలిక రకం విత్తనమన్నారు. ఎండు ఆకు, కాండం కుళ్లు, కంకి ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ రకం విత్తనాలు ఎంతో అనువైనవన్నారు. పంట సాగుకు నీరు ఇంకే నల్లరేగడి, ఎర్రనేలలు ఎంతో అనుకూలమన్నారు. నీరు ఇంకే నేలలు ఈ పంట సాగుకు పనికి రావన్నారు. విత్తే సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ ఎం–45 లేదా కాప్టాన్ మందుతో తప్పని సరిగా విత్తన శుద్ధి దిగుబడి ఆశించిన మేర ఉంటుందన్నారు.



గోవిందపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

**కలుపు యాజమాన్య పద్ధతులు**

పంట విత్తిన 2, 3 రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును ఎకరాకు 200 లీటర్లు నీటికి 800 గ్రాములు కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వలన ఒక నెల పాటు కొన్ని గడ్డిజాతి మొక్కలు పెరగకుండా అదుపు చేయవచ్చు. విత్తిన 30–35 రోజులకు పశువులు లేదా ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు నివారించుకోవచ్చు.

**ఎరువుల యాజమాన్యం**

మొక్కజొన్న విత్తిన 30–35 రోజుల మధ్య ఉన్నప్పుడు ఎకరాకు 30 కిలోల నత్రజని, 50 కిలోల పొటాష్ వేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేటు వేసుకోవాలి. మొక్కల ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేటు కలిపి పిచికారీ చేయాలి. పొలాల్లో పైపాటి ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.

**సస్య రక్షణ చర్యలు**

మొక్కజొన్న పంట రబీలో సాగు చేసే సమయంలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు మొదట ఆకుల పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండంలోకి చేరుతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వ చనిపోయి ఎండిపోతుంది. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పొలంలో కలుపు మొక్కలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి. పురుగు ఆశించిన మొక్కలు పీకి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3–4 వరుసల జొన్నను ఎర పంటగా వేసి 40 రోజుల తరువాత తీసి వేయాలి. మొక్కజొన్నలో అంతర పంటగా కంది, సోయాబీన్, సాగు చేయడం వలన పురుగు ఉధృతి తగ్గుతుంది. మోనోక్రోటోఫాస్–36 320 మిల్లీ లీటర్లు లేదా, క్లోరాంట్రినిలిప్రోల్ (కొరాజిన్, రైనాక్సిపర్) లాంటివి ఎకరాకు 60 మిల్లీలీటర్లు చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున పైరు మొలక ఎత్తిన 25–30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న మోక్షిత్, జయసింహ, నాగేంద్ర

**బత్తలపల్లి:** ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన జాంపుల జయసింహ, ఏడేళ్ల వయసున్న తన కుమారుడు మోక్షిత్‌తో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం బత్తలపల్లికి బయలుదేరాడు. బత్తలపల్లి శివారులోకి చేరుకోగానే వేల్పుమడుగు నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో జయసింహాతో పాటు మోక్షిత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్, అనంతపురంలోని బుడ్డప్పనగర్ నివాసి నాగేంద్రతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న వేల్పుమడుగు నివాసి నల్లప్పకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. వీరిలో మోక్షిత్, నల్లప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఏఎస్‌ఐ తిరుపాలు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### యువతి ఆత్మహత్య



మృతురాలు అశ్విని

**పెద్దపప్పూరు:** క్షణికావేశంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన రామాంజనేయులు, కంబక్కకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అశ్విని (19) రెండేళ్ల క్రితం ఇంటర్ పరీక్ష తప్పి ఇంటి పట్టునే ఉంటోంది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున చదువుకుంటున్న చెల్లెళ్లను ఇంటి పనిచేయాలని అశ్విని ఒత్తిడి పెట్టింది. ఆ సమయంలో తల్లిదండ్రులు కోపగించుకున్నారు. 'చదువుకుంటున్న వారిని ఎందుకు చెడగొడతావ్. నీవు కూడా వాళ్ల మాదిరిగానే ఇంటి పట్టున ఉండకుండా బుద్ధిగా కళాశాలకు వెళ్లి చదువుకో' అంటూ హితవు పలికారు. దీంతో క్షణికావేశానికి లోనైన అశ్విని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కాసేపటికి గట్టిగా చప్పుడు కావడంతో తల్లిదండ్రులు తలుపులు బద్ధలుగొట్టి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న అశ్వినిని గుర్తించి వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ అమానుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### విజేతలకు శుభాకాంక్షలు తెలిపే అవకాశం

- ఈ–పోస్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన పోస్టల్ శాఖ

**అనంతపురం సిటీ:** సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలా శాఖ ఈ–పోస్ట్ అందుబాటులోకి తెచ్చింది. దేశ వ్యాప్తంగా ప్రధాని మొదలుకొని ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు కేవలం రూ.10తో శుభాకాంక్షలు తెలిపే అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డివిజన్ తపాలా శాఖ అధికారులు కోరారు.

### 15.22 మీటర్లలో భూగర్భ జలాలు!

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాలో భూగర్భజలాలు సగటున 15.22 మీటర్లుగా నమోదైనట్లు ఆ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. 31 మండలాల పరిధిలో ఉన్న 97 ఫిజోమీటర్ల నుంచి సేకరించిన గణాంకాల ప్రకారం ఈ మేరకు నమోదైంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి మట్టం తగ్గింది. 512.5 మి.మీ గానూ 21.9 శాతం తక్కువగా 400.5 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో చాలా మండలాల్లో నీటి మట్టం తగ్గినట్లు విశ్లేషిస్తున్నారు. గతేడాది అంటే 2023 జూన్ మొదటి వారంలో నీటిమట్టం 7.67 మీటర్లుగా ఉండేది. అంటే గతేడాది కన్నా 7.55 మీటర్లు తగ్గుదల నమోదైంది. అయితే ఇటీవల జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడటం, వాగులు, వంకలు, చెక్ డ్యాంలు ప్రవహించడంతో వచ్చే నెల నాటికి భూగర్భజలాలు కాస్తంత పైపైకి పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ మొదటి వారంలోనే 60 మి.మీ పైగా వర్షపాతం నమోదైనందున దాని ప్రభావం భూగర్భజలాలపై ఉంటుందని తెలిపారు. ప్రస్తుతానికి 15.22 మీటర్లు నమోదు కాగా అందులో 97 ఫిజోమీటర్లలో 67 ఫిజోమీటర్లతో కాస్త లోతుకు వెళ్లినట్లు నివేదించారు. యాడికి మండలం ఫిజోమీటర్‌లో ఏకంగా 55.15 మీటర్లలో భూగర్భజలాలు కనిపించడం విశేషం. అలాగే గుమ్మఘట్ట మండలం తాళ్లకెరెలో 52.52 మీటర్లు, శెట్టూరు మండల కేంద్రంలో 51.70 మీటర్లుగా నమోదైంది. 8 మండలాల్లో 3 నుంచి 8 మీటర్లలో నీటి మట్టం కనిపిస్తుండగా 9 మండలాల్లో 8 నుంచి 15 మీటర్లలోనూ, మిగతా 13 మండలాల్లో 15 మీటర్లు అంతకన్నా ఎక్కువ లోతుగా నీటిమట్టం కనిపిస్తున్నట్లు నివేదికలో తెలిపారు.

### రిమాండ్‌కు నిందితులు

**గుంతకల్లు:** ఈ నెల 13, 14వ తేదీల్లో తాడిపత్రిలోజరిగిన అల్లర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 11 మంది అనుచరులను రిమాండ్‌కు ఆదేశిస్తూ గుంతకల్లు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మంజుల ఉత్తర్వులు ఇచ్చారు. నిందితులను గురువారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించడంతో నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

### అంతర పంటల సాగు లాభదాయకం : డీడీఏ

**తాడిమర్రి:** ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటలో అంతర పంటల సాగుతో అధిక ఆదాయం గడించవచ్చునని రైతులకు డీడీఏ గుడిపల్లి విద్యావతి సూచించారు. తాడిమర్రిలోని ఆర్‌బీకేను గురువారం ఆమె తనిఖీ చేశారు. సబ్సిడీ విత్తన వేరుశనగ నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తనం అందించాలని ఏఓ రమాదేవికి సూచించారు. అనంతరం సబ్సిడీ విత్తన వేరుశనగ గోదాములోని విత్తనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. విత్తనం సాగులో కంది, పెసర, అలసంద, ఆముదం తదితర అంతర పంటలను సాగు చేస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. అలాగే మేర సాలల్లో సజ్జ, జొన్న తదితర పంటలు సాగు చేస్తే పంటకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, హెచ్‌ఏఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న డీడీఏ

### ఓర్పుతో చదువు నేర్పించండి



మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

**అనంతపురం ఎడ్యుకేషన్:** విద్యార్థులకు ఓర్పు, నేర్పుతో చదువు నేర్పించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి సూచించారు. 1–2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు 'పిల్లలకు అర్థమయ్యేలాగా సులభంగా ఎలా బోధించవచ్చు' అనే అంశంపై మండలంలో ఎంపిక చేసిన ముగ్గురు ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ గురువారం ప్రారంభమైంది. స్థానిక కొత్తూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ చిన్న పిల్లలను తమ స్వంత పిల్లల్లా భావించి విద్యను నేర్పాలన్నారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం మండల విద్యాధికారి–2 లింగానాయక్, సమగ్ర శిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్ రెడ్డి, మాధవ రెడ్డి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



### బైక్ ఢీ – ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన హుస్సేన్, పురుషోత్తం, బాషా

**గుత్తి రూరల్:** వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన బాషా, పురుషోత్తం పనిపై గురువారం గుత్తి ఆర్ఎస్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మాటల్లో ఉండడంతో బసినేపల్లి శివారులో రోడ్డు దాటుతున్న హుస్సేన్‌ను గమనించకుండా నేరుగా వెళ్లి ఢీకొన్నారు. ఘటనలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి బాషా, పురుషోత్తంతో పాటు హుస్సేనూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### శ్రీసత్యసాయి జిల్లాపై నైరుతి ప్రభావం



పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద వర్షం నీళ్లు

**పుట్టపర్తి అర్బన్:** ఇటీవల జిల్లాలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరికొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతోంది. బుధవారం రాత్రి జిల్లాలోని 27 మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి బత్తలపల్లి మండలంలో అత్యధికంగా 63.4 మి.మీటర్లు, ధర్మవరంలో 43.6, లేపాక్షిలో 35.8, ఓడీ చెరువులో 35.4, హిందూపురంలో 33.8, పరిగిలో 30.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ఎన్పీ కుంటలో 26.6, సోమందేపల్లిలో 26.4, తలుపులలో 24.4, చిలమత్తూరులో 20.4, గోరంట్లలో 19.2, గాండ్లపెంటలో 18.8, అమడగూరులో 18.2, తాడిమర్రిలో16.4, కదిరి, కొత్తచెరువు మండలాల్లో 15.2, ముదిగుబ్బలో 14.8, పెనుకొండలో 13.2, సీకే పల్లిలో 12.4, బుక్కపట్నం, అమరాపురంలో 10.4, పుట్టపర్తి, నల్లచెరువులో 8.2, రామగిరిలో 6.8, నల్లమాడలో 4.8, కనగానపల్లిలో 4.2, మడకశిరలో 2.6 మి.మీటర్ల వర్షం పాతం నమోదైంది. జిల్లాలో 27 మండలాల్లో మొత్తం 539.4 మి.మీటర్ల వర్షం కురిసింది.

### మృతుడి ఆచూకీ గుర్తింపు

**ఓడీచెరువు:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని యువకుడి ఆచూకీని ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో పోలీసులు కనుగొన్నారు. వివరాలు... మండల కేంద్రం ఓడీ చెరువుకు చెందిన బాబావలి కుమారుడు ఎస్.షామీర్ బాషా (28).. వెల్డింగ్ కూలి పనులతో కుటుంబానికి చేదోడుగా ఉంటూ వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 27న తన తల్లితో గొడవపడి రూ.వెయ్యి తీసుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. రోజులు గడుస్తున్నా కుమారుడు ఇంటికి రాకపోవడంతో బంధువుల సాయంతో తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మే 2న ఓడీ చెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఓడీసీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. షామీర్‌బాషా ఫొటోలను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చేరవేయడంతో పాటు క్రిమినల్ ఇంటిలిజెన్స్ సిస్టమ్ సాంకేతికత సాయంతో షామీర్‌బాషా ఆచూకీ కోసం ఎస్‌ఐ వంశీకృష్ణ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన యువకుడి ముఖకవళికలతో షామీర్‌బాషా పోలికలు సరిపోవడంతో అనుమానం వచ్చిన ఎస్‌ఐ వంశీకృష్ణ వెంటనే బాబావలి కుటుంబసభ్యులను పిలుచుకెళ్లి చూపించారు. మృతుడు షామీర్‌బాషానేనని తల్లిదండ్రులు నిర్ధారించారు. ఎక్కడో ఓ చోట బతికే ఉంటాడనుకున్నామని, ఇలా అర్ధంతరంగా చనిపోతాడని తాము ఊహించలేదంటూ తల్లిదండ్రులు బోరున విలపించారు. కాగా, షామీర్‌బాషా ఆచూకీ కనుగొనడంతో ఎస్‌ఐ వంశీకృష్ణ చూపిన చొరవను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

### రేపు హాకీ జట్టు ఎంపిక పోటీలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 8వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ధర్మవరంలో జరిగే సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే సీనియర్ క్రీడాకారులు 01-01-1995 అనంతరం జన్మించి ఉండాలన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌కు 18 మంది ఎంపిక



మొదటిస్థానంలో నిలిచిన లక్ష్మీనివాస్, పల్లవి

**ధర్మవరం అర్బన్:** ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ధర్మవరంలోని ఏపీ మోడల్ స్కూల్ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. ఇందులో లక్ష్మీనివాస్, పల్లవి జిల్లా ఫస్ట్ సాధించారన్నారు. ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ప్రతి ఏడాది రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

### వైభవంగా శనీశ్వరుడి జయంతి వేడుకలు

**పావగడ:** పట్టణంలోని శనిమహాత్ముడి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రాతఃకాల పూజలు, నవగ్రహ మూల మూర్తులకు ఏకాదశ వార రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, ప్రధాన మూల మంత్ర హోమాలు, గాయత్రి హోమం, మహా పూర్ణాహుతి, కలశోదక అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అనంతరం జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి దీపాలంకృత ఉత్సవం కనుల పండువలా సాగింది. మూడు రోజులుగా సాగుతున్న శని జయంతి వేడుకలు గురువారం ముగిశాయి. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ఆలయ సమితి పదాధికారులు భక్తులకు సేవలందించారు.

## క్లుప్తంగా

### ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**ఆత్మకూరు:** మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఐదు సంవత్సరాలు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. అభివృద్ధి చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. తాము ఎప్పుడూ ప్రకాష్‌రెడ్డి వెంటే నడుస్తామని స్పష్టం చేశారు.

### అందరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్న అధికారులు, ఎన్నికల సిబ్బందికి తహసీల్దార్ పరమేశ్వర స్వామి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చొరవ తీసుకున్నారన్నారు. అనంతరం నిత్యవసరాల సరుకుల పంపిణీపై వీఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా పంటలు గాని, ప్రాణనష్టం జరిగినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

### క్షయ వ్యాధి నివారణకు టీకాలు



న్యామద్దెలలో మహిళకు బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

**చెన్నేకొత్తపల్లి:** మండలంలోని ఎస్‌గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం క్షయ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి గురువారం ఆయా గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఎస్‌ఎస్‌గేట్ డాక్టర్ రవినాయక్, డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బీసీజీ టీకాలు వేశారు. ఈ కేంద్రాల ద్వారా క్షయ వ్యాధిపై ఉన్న అపోహలు, వాటి నివారణ చర్యలు, క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని వైద్యులు తెలిపారు. క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకా వేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయంలో పూజలు

**రాప్తాడు:** స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం భక్తాదులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### జోరుగా పూడికతీత పనులు



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మిషన్ ద్వారా మురుగును తీస్తున్న దృశ్యం

**అనంతపురం కార్పొరేషన్:** వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గురువారం నగరంలోని జేఎన్‌టీయూ, ఆర్టీసీ బస్టాండ్, కమలానగర్, సాయినగర్, విద్యుత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టుకు తరలించాలన్నారు. ప్రజల సైతం చెత్తను నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు. అసలే వానలు కురుస్తున్న రోజుల్లో చెత్తాచెదారాన్ని కాలువల్లో వేయకూడదని విజ్ఞప్తి చేశారు. కాలువలు బ్లాక్ అవడం ద్వారా మురుగు నిల్వ ఉండి, రివర్స్‌లో రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతాల్లో సక్షన్ ఆపరేటర్ ద్వారా పూడిక, మురుగును తొలగించేలా సిబ్బందిని ఆదేశించారు.

# పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం



నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

- ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి

**అనంతపురం కార్పొరేషన్:** దోమలు వృద్ధి చెందకుండా ఇళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుందామని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పేర్కొన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అంతకుముందు పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. జూన్‌లో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా దోమకాటు నివారణ చర్యలు, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, వివిధ ప్రాంతాల్లో నీరు నిలిస్తే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎక్కడైతే ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటుందో ఆ ప్రాంతాల వివరాలను పంపాలని సూచించారు. జూలై నుంచి నీరు నిల్వ ఉన్న కుంటల్లో దోమ లార్వాలను తినే గంబుజియా చేపలను వదలడం జరుగుతుందన్నారు. అనంతపురం సబ్ యూనిట్ అధికారి మద్దయ్య మాట్లాడుతూ.. దోమల నివారణ చర్యలు సకాలంలో చేపట్టడం ద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో ప్రజలను సమన్వయం చేసుకుని మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్ మూర్తి, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దోమకాటు నివారణ చర్యలు**

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు దోమకాటు నివారణ చర్యలు తీసుకుంటున్నారు. గురువారం కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో పారిశుధ్య కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు సంయుక్తంగా వివిధ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల గుర్తించి ప్రజారోగ్యాధికారులకు సమాచారం అందించారు. పారిశుధ్య సిబ్బంది నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. అలాగే ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి.

### ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

**చెన్నేకొత్తపల్లి:** 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ప్రవేశ పరీక్షలో పాస్ అయిన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. పై తరగతులతో పాటు ఇంటర్‌లో ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో చేరదలచిన విద్యార్థులు కళాశాల పని వేళల్లో సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### 9న మహిళా సున్నీ ఇజ్‌తెమా

**అనంతపురం కల్చరల్:** తెహరికె ఫైజానే ఉమర్ ఫారూఖ్ వారి ప్రథమ వార్షిక మహిళా సున్నీ ఇజ్‌తెమా ఈనెల 9న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రి తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మసీదు కమిటీ సభ్యులతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. ఆదివారం స్థానిక రాణీనగర్‌లోని బహామీ బైతుల్ మాల్ షాదీ మహల్ వేదికగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగే ఆధ్యాత్మిక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా ముల్లిమాలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ప్రత్యేక వసతులతో పాటూ భోజన సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీద్ ముతవల్లి ఫరుదీద్దున్, సెక్రటరీ పర్వేష్, షబ్బీర్ అహమద్, అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.

# కళలను ప్రోత్సహించాలి



బహుమతులు అందజేస్తున్న సంధ్యామూర్తి

**అనంతపురం కల్చరల్:** కేవలం చదువులు, ర్యాంకులు మాత్రమే కాకుండా సృజనాత్మకమైన కళలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి సూచించారు. గత నెలరోజులుగా సాగిన కళాసాగర్ డాన్స్ అకాడమీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు గురువారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో ఘనంగా జరిగాయి. మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు సంధ్యామూర్తి, షణ్ముక నాయుడు, పట్నం శివప్రసాద్, హరిప్రసాద్ ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్న విజయ్ కుమార్‌ను అభినందించారు. కేవలం డ్యాన్సులు మాత్రమే కాకుండా బహుముఖ ప్రజ్ఞతో కరాటే, డ్రాయింగ్, క్రాఫ్ట్ వర్క్ వంటి అంశాల్లో నైపుణ్యం అపారమని కొనియాడారు. అనంతరం శిక్షణ ముగించుకున్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన నాట్య విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్లు, వందలాది మంది కళాభిమానులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి పక్కన ఏపుగా పెరిగిన చెట్లు



చెన్నేకొత్తపల్లి సమీపంలో ఉన్న కొండలో నెలకొన్న పచ్చదనం

### పచ్చదనం పరిచేలా..

మొన్నటి వరకూ విపరీతమైన ఎండలకు మోడు వారిన చెట్లు ఇటీవల కురిసిన వర్షాలకు చిగురించాయి. చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా విస్తారంగా కురిసిన వర్షాలకు ఎటు చూసినా పచ్చదనం కనిపిస్తోంది. నేలతల్లికి పచ్చాని రంగేసినట్లు కనువిందు చేస్తోంది. కొండలు, జాతీయ రహదారి పక్కన పెంచిన చెట్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఇరువైపులా ఉన్న చెట్లు చూపరులను ఆకర్షించడమే కాదు.. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వర్షం రాకతో మూగ జీవాలకు పశుగ్రాసం సమస్య తీరనుంది.

– చెన్నేకొత్తపల్లి:

# రూ.4 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

**ఆత్మకూరు:** ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగితే పరిహారం వర్తిస్తుందని ఎస్‌బీఐ మేనేజర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జ్యోతిరాణి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో జ్యోతిరాణి ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో రూ.4 లక్షల ప్రమాద బీమా వర్తించిందని పేర్కొన్నారు. గురువారం ఎస్‌బీఐలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిరాణి భర్త శ్రీనివాస శర్మకు రూ.4 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ప్రాణ నష్టం జరిగినా లేదా ప్రమాదానికి గురైనప్పుడు బాధిత కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ నగదు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, సిబ్బంది నారాయణ స్వామి పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ కె.చంద్రశేఖర్

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి రూరల్/పెద్దవడుగూరు:** గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండల కేంద్రానికి చెందిన పరమేష్, మల్లికార్జున కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామ శివారులో వజ్రాల వేటకు వెళ్లారు. అనంతరం తిరిగి యాడికికి బయలుదేరారు. ఇదే సమయంలో రాయలచెరువుకు చెందిన వ్యక్తులు ద్విచక్ర వాహనంలో గుత్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యమంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో ఇరువురు బండి తోసుకుంటూ వెళ్తుండగా వెనకనుంచి పరమేష్, మల్లికార్జున బైక్‌లో వెళ్తూ ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వాపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

**ద్విచక్ర వాహనం అదుపు తప్పి ...**

**యాడికి:** ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళ తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చందన గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీ కాంతమ్మ తన కుమారుడు తేజతో కలసి ద్విచక్ర వాహనంలో రాయలచెరువుకు బయలు దేరారు. చందన గ్రామ చివరన రాయలచెరువుకు పోయే మార్గంలో ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్ద రైతులు ఇటీవల పొలాలకు పైపులైను ఏర్పాటు చేసేందుకు రోడ్డును తవ్వి మళ్లీ మట్టిని కప్పటంతో పెద్ద స్పీడు బ్రేకరు మాదిరిగా ఉంది. గమనించని తేజ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంతో.. వాహనం అదుపు తప్పి వెనుక కూర్చొన్న లక్ష్మీకాంతమ్మ కింద పడటంతో చెవులో నుంచి రక్తం వచ్చింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పైపులైను కోసం రోడ్డును తవ్విన చోట ఎగుడుదిగుడు లేకుండా రైతులు రోడ్డును చదును చేయాలని వాహనదారులు కోరారు.

### సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో దర్గా

**బొమ్మనహాళ్:** ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

### శివాలయాల్లో అమావాస్య పూజలు



అలంకరణలో నగరేశ్వర స్వామి

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని నగరేశ్వర స్వామి, రామేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతి, రుద్రాభిషేకం, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మండలంలోని జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించారు. కమలపాడులోని శివాలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు.

### కిరాణా షాపులో చోరీ

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని శాంతి నగర్‌లో కృష్ణమూర్తి అనే వ్యక్తికి చెందిన కిరాణాషాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం కృష్ణమూర్తి దుకాణాన్ని తెరవగా, చోరీ జరిగినట్లు గుర్తించాడు. రేకులషెడ్డులో నిర్వహిస్తున్న షాపు వెనుక వైపు రేకును కోసి దుండగులు ప్రవేశించి, చోరీకి పాల్పడ్డారు. రూ.25 వేల నగదు, రూ.50 వేల విలువైన సరుకులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి

**అనంతపురం కార్పొరేషన్:** రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరంలోని లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివాసముంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారీ వృక్షాలున్న చోట ఉండకూడదని తెలిపారు. నగరవాసుల సౌకర్యార్థం హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్లు 08554-274765, 08554-230234ను సంప్రదించాలని సూచించారు.

### నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**రాప్తాడు:** మండలంలోని రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, బొమ్మేపర్తి, లింగనపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు శుక్రవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 6వ తేదీ వరకు హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554-246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

### అన్వరానంద స్వామి ఊరేగింపు

**కంబదూరు:** మండలంలోని ఓబగానపల్లిలో గురువారం వైశాఖ మాస అమావాస్యను పురస్కరించుకుని అన్వరానంద స్వామి చిత్ర పటాన్ని ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పాటలు పాడారు.

### 'నీట్'లో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ



జుబేర్ అసిఫ్ మాలిక్

**అనంతపురం ఎడ్యుకేషన్:** నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి 'నీట్' ఫలితాల్లో సత్తా చాటాడు. జుబేర్ అసిఫ్ మాలిక్ 629 మార్కులు సాధించడంతో కళాశాల ఏజీఎం మురళీకృష్ణ, డీన్ ప్రసాద్, ప్రిన్సిపాళ్లు దుర్గేష్, రవికుమార్, కిషోర్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



# మార్కెట్లో కూరగాయల మంట

- అమాంతం పెరిగిన ధరలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**కనగానపల్లి:** మార్కెట్‌లో కూరగాయల ధరలు మండుతున్నాయి. వేసవిలో రైతులు పెద్దగా కాయగూరల పంటలు సాగు చేయలేదు. దీంతో దిగుబడి కూడా తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

మార్కెట్లలో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ధరలను చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

టమాట దగ్గర నుంచి మిరపకాయలు, బెండ, బీర కాయలు, బీట్ రూట్, బంగాళాదుంప, క్యారెట్, వంకాయలు ఇలా ఏది కొనాలన్నా కేజీ రూ.50 నుంచి రూ.100 పైగా పలుకుతున్నాయి. వీటితో పాటు ఆకు కూరలు, కొత్తిమీర కొనాలన్నా కట్ట రూ.20 నుంచి రూ.50 చెబుతున్నారని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు చికెన్, మాంసం, కోడు గుడ్లు ధరలు కూడా ఆకాశాన్ని అంటుతుండటంతో ఏమి కొని తినాలో అర్థం కావటం లేదని సామాన్యులు మండిపడుతున్నారు.



కనగానపల్లి మార్కెట్లో విక్రయిస్తున్న కూరగాయలు

**మార్కెట్లలో ఉన్న కూరగాయల ధరలు**

| కూరగాయల పేర్లు | ధర (కేజీ) |
|---|---|
| టమాట | రూ.80 |
| బీరకాయలు | రూ.100 |
| పచ్చి మిరప | రూ.100 |
| బెండకాయలు | రూ.100 |
| వంకాయలు | రూ.60 |
| బీట్ రూట్ | రూ.50 |
| క్యారెట్ | రూ.80 |
| బంగాళదుంపలు | రూ.75 |
| చిక్కుడు కాయలు | రూ.150 |
| బీన్స్ | రూ.200 |
| చికెన్ | రూ.300 |
| మటన్ | రూ.800 |
| కోడిగుడ్లు (డజన్) | రూ.80 |

### ఏమి కొనాలన్నా భయంగా ఉంది

సంతలో కూరగాయలు ఏమి కొనాలన్నా ధరలు చూస్తే భయమేస్తోంది. ఎప్పుడు లేని విధంగా కూరగాయలు ధరలు పెరిగిపోయాయి. రూ.500 తీసుకుని సంతకు వెళ్తే నాలుగైదు కేజీల కూరగాయలు కూడా కొనలేపోతున్నాం. ధరలు ఇలా ఉంటే ఏమి కొని తినాలో తెలియడం లేదు.

– నారాయణమ్మ, గృహిణి, కనగానపల్లి

### ధరలు చాలా పెరిగాయి

మార్కెట్లలో కూరగాయల ధరలు ఎప్పుడూ లేని విధంగా పెరిగాయి. సంతలో ఏమి కొనాలన్నా కేజీ రూ. వంద దాకా చెబుతున్నారు. సామాన్యులు కూరగాయలు కొనే పరిస్థితి లేదు. దీనికి తోడు మాంసం, కోడిగుడ్లు ధరలు కూడా బాగా పెరిగాయి. నిత్యావసరాలకు చాలా డబ్బు వెచ్చించాల్సి వస్తోంది.

– రామకృష్ణ, కోనాపురం, కనగానపల్లి మండలం